విశాలాంధ్ర కృష్ణా జిల్లా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని చల్లపల్లి మండలానికి చెందిన ఇరువురికి ఘంటశాల, మోపిదేవి మండలాలకు చెందిన ఒకొక్కరికి మొత్తం నలుగురికి కలిపి రెండు లక్షల ఆరవై ఒక్కవేల రూపాయల విలువ గల చెక్కులను ఎం.ఎల్.ఏ రమేష్ బాబు తన కార్యాలయంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, గొళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కొనసాగించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎలక్ట్రిసిటీ ఎయిర్‌ఫోర్స్, విశాఖ ఉక్కు తదితర ప్రభుత్వ రంగసంస్థలను అనిల్ అంబానీ, ఆదానికి కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టకుండా కేంద్ర ప్రభుత్వమే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ టి.తాతయ్య డిమాండ్ చేశారు. స్థానిక మోదుమూడి శ్రీహరి రావు భవనంలో ఆదివారం ఏఐటీయూసీ కృష్ణా జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తాతయ్య మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన దేశవ్యాప్తంగా ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపకదినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద, ప్రభుత్వ ఆసుపత్రులు, మున్సిపల్ కార్యాలయాల, యూత్ కార్యాలయాలతో పాటు ముఠా కార్మికులు నిర్వహిస్తున్న మార్కెట్ యార్డుల దగ్గర జెండా ఆవిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని కార్మిక కర్షక ఉద్యోగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొంతమంది కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎలక్ట్రిసిటీ ఎయిర్ ఫోర్స్, విశాఖ ఉక్కు తదితర ప్రభుత్వ రంగసంస్థలను అనిల్ అంబాని, ఆదానికి కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. స్వాతంత్ర పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న చరిత్ర కలిగిన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో కార్మిక హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సెక్టార్నీ పునరుద్ధరింప చేస్తామని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ కట్టే వరకు పోరాటాలు నిర్వహిస్తామని 60 సంవత్సరాల నుండి ప్రతి కార్మికునికి రూ.6 వేలు పింఛన్ ఇచ్చేవరకు ఏఐటీయూసీ తరపున పోరాటాలు నిర్వహిస్తామని, ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణలు చేస్తూ కార్మిక నాయకులు ప్రతిజ్ఞ చేయాలని ఆయన కోరారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర ధరలు పెంచుతూ కోట్ల అవినీతికి పాల్పడుతూ దేశాన్ని, రాష్ట్రాన్ని దోపిడీ చేస్తూ ప్రజల శ్రమను ప్రత్యక్షంగా దోసుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనే రాబోయే ఎన్నికల్లో ఓడించాలని తాతయ్య ప్రజలకు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు లింగం ఫిలిప్పు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-గుడివాడ : ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలంటు గుడివాడ డిపోలో కార్మికుల సంఘల నాయకులు నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఎంప్లాయిస్, ఎన్ఎం, పలు కార్మిక సంఘాల నాయకులు కె.బాలాజీ, ఎన్.మదనమోహన్, కె.ఎస్, సుబ్రహ్మణ్యం, రంగయ్య, రమణ తదితరులు మాట్లాడుతూ కావలి పట్టణంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలను చట్టప్రకారం శిక్షించాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. అకారణంగా ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేయడం బాధాకరమన్నారు. కార్మికులపై మరోసారి ఇలాంటి దాడులు జరిగితే సహించేది లేదని హెచ్చారించారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు, ఆర్టీసీ డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

85 నిమిషాలు కొనసాగిన పాక్షిక చంద్రగ్రహణం



విశాలాంధ్ర-కూచిపూడి : ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా శనివారం అర్ధరాత్రి 11.30 గంటల నుంచి ప్రారంభమైన చంద్రగ్రహణం ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల 58 నిమిషాల వరకు కొనసాగింది. అయితే ఆదివారం అర్ధరాత్రిగం. 1.05 నిమిషాల నుంచి గం.2.23 నిమిషాల వరకు మాత్రమే సాక్షిగా చంద్రగ్రహణం కంటికి కనిపించింది. ఈ గ్రహణ కాలంలో పలువురు ఉపాసనలు చేయగా మరి కొంతమంది నీళ్లు పోసిన పళ్లెంలో రోకల్ని నిలపెట్టడం లాంటి ప్రయోగాలు చేయటం గమనార్హం!

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్రంలో కొనసాగుతున్న పరిపాలనను చూడలేకపోతున్నామని కళ్ళకు గంతలు కట్టుకుని మండలంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం రాత్రి గ్రామ, గ్రామాన కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి చీకటి పాలన అంతమొందించాలని వ్యక్తం చేస్తూ, చంద్రబాబుకు మద్దతుగా నిజం గెలవాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్క రాంబాబు మండల గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముంచిన ఖరీఫ్!

- కమ్ముకున్న కరువుమేఘాలు
- 70 శాతానికే పడిపోయిన సాగువిస్తీర్ణం
- ఎండిపోతున్న వర్షాధార పంటలు
- భారీగా నష్టపోతున్న వరి రైతులు

ఈ ఏడాది ఖరీఫ్ రైతులను కారుమేఘాలు చుట్టుముట్టాయి... నీలిమేఘాలను నమ్మి సాగుచేసిన రైతన్నకు కన్నీరే మిగిల్చాయి... పెట్టిన పెట్టుబడులు చల్లి ఆకాశంలో వెతుక్కునే అమాయక ప్రయత్నంగా మారింది రైతన్న పరిస్థితి. గతంలో ఎన్నడు లేనంతగా వర్షపాతం నమోదవడంతో సాగు విస్తీర్ణం 70 శాతానికి పడిపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది... సాగైన విస్తీర్ణంలో వర్షాదార పంటలు ఇప్పటికే అత్యదిక శాతం ఎండిపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుండడం, సాగునీరు, విద్యుత్ సమస్యలు రోజు రోజుకు ఎక్కువవడంతో జిల్లాలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది...

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ ఏడాది (2023) ఖరీఫ్ సీజన్ ఆటుపోట్ల మధ్య ప్రారంభమై కొనసాగుతోంది. ఈ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి పగబట్టిన ప్రకృతితో రైతులు పడరాని పాట్లు పడటంతోపాటు నేటికీ కొనసాగుతోంది. అప్పట్లో ఏదో విధంగా ఒడ్డున పడ్డా వరి పైరు ఈనే స్థాయికి చేరుకునేటప్పటికీ రైతులను సాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. మొవ్వ మండలంలో 26 వేల ఎకరాలకు పైగా ఈ ఏడాది వరిసాగు చేసుకుంటున్నారు. వరి నాట్ల సమయంలో నిరంతరంగా కురిసిన వర్షాలతో రైతన్నలు పడిన బాధలు వర్ణనాతీతం!!. అప్పట్లో కురిసిన వర్షాల పుణ్యమాని పలు పొలాలు రెండోసారి నాటు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో రైతులు ఆర్థికంగా ఇబ్బందులతో సతమతమయ్యారు. ఒకవైపు కూలీలకు ఇంకొక వైపు వరి నారుకు అధిక మొత్తాలు(వేలాది రూపాయలలో) చెల్లించి వరి సాగు చేసుకున్నారు. ఆ సమయంలో రైతుల కళ్ళ నీళ్లు తుడటానికన్నట్లు గ్రామ వ్యవసాయ సహాయకులతో మునిగిపోయిన వరిపొలాల వివరాలు సర్వే చేశారే తప్ప చిటికెడు సహాయం చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం ఏ విధంగా అప్పట్లో రైతులను ఆదుకోకపోవడంతో ఎకరానికి వేలాది రూపాయలు వెచ్చించి వరినారు కొనుగోలు చేసుకుని నాట్లు వేసుకున్నారు. ఈ విధంగా ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని వరి సాగు చేసుకున్న రైతులకు ప్రస్తుతం సాగునీటి పట్టిపీడిస్తోంది. ప్రతి ఏడూ ఈపాటికి ఇంచుమించుగా వరి పైరు కోతలకు సిద్ధం అయ్యేది.ఈ ఏడు దానికి భిన్నంగా ఇప్పుడిప్పుడే పొలాలు ఈనుతున్నాయి. కొద్ది పొలాలు పాలు పోసుకోగా, మరికొన్ని పొలాలు సుంకు మీద, ఇంకొన్ని పొలాలు గింజ గట్టి పడే స్థాయికి చేరుకున్నాయి. ఈ దశలో నీరు పొలాలకు అందకపోవటంతో వరి కంకులు దృఢంగా రావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగువపొలాలకు సైతం నీరు అందక పోవడంతో ఆయిల్ ఇంజనుల ద్వారా నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈఏడాది ఆలస్యంగా నాట్లు పడటంతో 30 నుంచి 40 శాతం వరకే వరి పొలాలు ఈనినట్లు అధికారుల సమాచారం. గత మూడు నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి మబ్బులు ఊరిస్తున్నాయే తప్ప వర్షాలు పడే అవకాశం భూతద్దం పెట్టి వెతికిన కాన రావట్లేదు. ఈ పరిస్థితులలో తేలికపాటి వర్షాలు అయినా పడితే తిరుపట్ట దశలో ఉన్న పొలాలలోమొవ్వులోకి నీరు వెళ్లి కంకే తొందరగా బయటికి వస్తుందేమోనని రైతులు భావిస్తున్న అది ఎండమావిగానే కనబడుతోంది. ఈ ఏడాది ఎంటియు 1061, ఎం టి యు 13 18 రైతులు సాగు చేసుకున్నారు. అయితే కరువులో అధికమాసం అన్నట్లు కొన్ని పొలాలలో బెరుకు రావడంతో అవి ముందుగాఈనాయి. కొంతమంది రైతులు వాటిని(ఆ కంకెలను) కోయించుకొనే ప్రయత్నంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొనే కౌలు రైతుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకతో తయారయింది. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి సాగునీరు కాలువల ద్వారా విడుదల చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

చట్టసభల్లో కమ్యూనిస్టులకు ప్రాధాన్యత రావాలి

శివరామ కృష్ణ, కృష్ణమోహన్‌ల వర్ధంతి సభలో హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ

విశాలాంధ్ర-చల్లపల్లి : చట్టసభలలో కమ్యూనిస్టులకు ప్రాధాన్యత రావాలని సీపీఐ జిల్లా నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పేర్కొన్నారు. సీపీఐ నాయకులు, వక్కలగడ్డ గ్రామ ప్రముఖులు కామ్రేడ్ హనుమానుల శివరామకృష్ణ, మలుపెద్ది కృష్ణ మోహన్‌ల 25వ వర్ధంతి మండల పరిధిలోని వక్కలగడ్డలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ మారుతున్న రాజకీయ సమీకరణాలకు చట్టసభలలో కమ్యూనిస్టుల పాత్ర ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. చట్టసభలలో కమ్యూనిస్టుల ప్రాధాన్యత లేకపోవడంతో ప్రశ్నించేతత్వం లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ పరిపాలన సాగిస్తున్నాయని ఇలాంటి సందర్భాలలో ప్రశ్నించే గొంతుకలు కావాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో చట్టసభలకు కమ్యూనిస్టు పార్టీ నాయకులను పంపాల్సిన బాధ్యత ప్రజలపై ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. సమసమాజ స్థాపన కోసం శివ రామకృష్ణ, కృష్ణమోహన్‌లు చేసిన త్యాగాలు వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పై ఉందని తెలిపారు. తాము నమ్మిన సిద్ధాంతం కోసం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు గా కడవరకు జీవనం సాగించిన శివరామకృష్ణ, కృష్ణమోహన్ లు నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయంగా నిలుస్తారని పేర్కొన్నారు. వారి ఆశయాలను సాధించడం కోసం ప్రతి కార్యకర్త పాటుపడిన నాడే వారికి నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా పనిచేసి వక్కలగడ్డ అభివృద్ధిలో శివ రామ కృష్ణ, కృష్ణ మోహన్ ల త్యాగాలు చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతాయన్నారు. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం లో కామ్రేడ్ మలుపెద్ది రామసుబ్బయ్య, రవణ వరపు వెంకటేశ్వరరావు, హనుమానుల వెంకటేశ్వరరావు లతో కలిసి కృషి చేసారన్నారు. పేదలకు వ్యవసాయ భూమి, ఇళ్ల స్థలాల పంపిణీ కోసం కమ్యూనిస్టు పార్టీ చేసిన ఉద్యమాల్లో అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రజానాట్యమండలి ద్వారా అనేక వీధి నాటకాలు ప్రదర్శించి ప్రజల మన్ననలు పొందారాని కొనియాడారు. తొలుత పార్టీ నాయకులు శివరామకృష్ణ, కృష్ణమోహన్ లా చిత్రపటానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు. ప్రజా నాట్యమండలి నాయకులు మల్లుపెద్ది రాజా ఆలపించిన గీతం ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, పార్టీ సీనియర్ నాయకులు మల్లుపెద్ది బోసు, అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది అజయ్, పాలడుగు రత్నకుమార్, మల్లుపెద్ది లెనిన్, అల్లూరి బాబురావు, హనుమానుల సాయి రత్న బాబు, నక్కా శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్, లంకా నాగమల్లి, ఆర్ఎంపి డాక్టర్ శేషు ,యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన యోగ సాధకులకు సన్మానం

విశాలాంధ్ర -మచిలీపట్నం : ఆంధ్రప్రదేశ్ యోగసభ సభ్యులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు పొందటం మచిలీపట్నానికి గర్వకారణం అని ఆంధ్రప్రదేశ్ యోగ సభ ప్రధాన కార్యదర్శి, యోగ గురువు ఘంటసాల గురునాథ్ బాబు అన్నారు. మచిలీపట్నం చెందిన పలువురు అవార్డులు పొందిన సందర్భంగా ఆదివారం చింతగుంటపాలెం ఆంధ్ర ప్రదేశ్ యోగసభ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గురునాథ్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో యోగ ప్రక్రియ ఎంతో అవసరమని అన్నారు. నేడు మారుతున్న జీవన సరళిలో యోగ ప్రాముఖ్యత పెరిగిందని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపురావడం జరిగిందని ఆయన తెలియజేశారు. ముఖ్య అతిథి అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు బొర్రా విఠల్ మాట్లాడుతూ ప్రతి స్కూలులో విద్యార్థి విద్యార్థులకు యోగ నేర్పడానికి కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో రాష్ట్రస్థాయిలో జిల్లా స్థాయిలో యోగా, ఈత పోటీలలో ప్రథమ ద్వితీయ స్థానాలు పొందిన ప్రధాన ఉపాధ్యాయురాలు సిహెచ్. సునంద, తాళ్లపాలెం టీచర్ కె. స్వర్ణలత బుద్దాలపాలెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వివి మధుసూదన్ రావు, సీనియర్ ఆడిటర్ ఎస్. రమేష్ ను ఆంధ్రప్రదేశ్ యోగ సభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ,ఉప జిల్లా విద్యాశాఖ అధికారి యు. సుబ్బారావు, రామిశెట్టి దుర్గాప్రసాద్, ముదిగొండ శాస్త్రి, చింతాయ్య మాస్టారు,కొక మహేష్, పల్లపోతు కృష్ణ ఇతర యోగ సభ సభ్యులు పాల్గొన్నారు.

నిజం గెలవాలి-సంకెళ్లు బద్దలవ్వాలి : రావి

విశాలాంధ్ర-గుడివాడ : చంద్రబాబుకు వేసిన సంకేళ్లు బద్దలు కావాలని కోరుతూ ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో నిజం గెలవాలి చంద్రబాబుకు వేసిన సంకెళ్ళు బద్దలు కావాలని కోరుతూ కళ్లకు గంతలు కట్టుకుని సెల్‌ఫోన్ లైట్లతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణా, రూరల్ మండలల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, మహిళ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, సర్పంచ్ కాకరాల సురేష్, నాయకులు పొలాసి ఉమా, షేక్ జానీషరీఫ్, కరీంముల్లా, సురేష్, చీకటి శేషగిరి, ప్రసాద్, వేణ్, తేనేల ఏడుకొండలు నిమ్మగడ్డ కృష్ణారావు, దారపురెడ్డి మణి, శేషు, దాసు శ్యామ్, విశ్వనాథం, రజనీకాంత్, కృష్ణ, కనకబరం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక చీకటి పాలన అంతం కావాలి : బొడ్డు

విశాలాంధ్ర-పెడన : రాష్ట్రంలో అరాచక చీకటి పాలన అంతం కావాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. ఈ మేరకు పెడన పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిజం గెలవాలి.. చంద్రబాబుకు వేసిన సంకెళ్లు బద్దలు కావాలి అది జరగాలంటే జగనాసురు నికి కనువిప్పు కావాలి అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో రాజ్యంలో సంస్కారహీనులు చంద్రబాబు నాయుడు లాంటి నిప్పులాంటి మనిషికి చెద పట్టిందని నిరూపించే ప్రయత్నం ప్రజలు నమ్మరని అన్నారు.నవంబర్ 1 నుండి ప్రజల వద్దకు జగన్ ప్రభుత్వం అరాచకాలను వివరిస్తూ, తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పద కాలను వివరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పూల బాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య, పరసా. సూర్యనారాయణ, ఇమ్మడి నాగపోతరావు, మహమ్మద్ హమీదుల్లా(గుజ్రాల్) సేనాపతి అజయ్ కుమార్, పరసా. జితేంద్ర, బొడ్డు దీక్ష, జన్ను సూరయ్య, ఖలీల్ బాషా, పులి రవి, దాదా, మేడక. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిబద్ధతే మూలం

విశాలాంధ్ర-పమిడిముక్కల: తాను నమ్మిన సిద్ధాంతాలను నిబద్దతతో లక్ష్య సాధనకు కృషి చేసిన గురజాడ గ్రామ నివాసి గురజాడ వెంకటేశ్వరరావు పంథాలో నేటి యువత నడవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాజులపాటి రామచంద్రరావు అన్నారు.ఆదివారం గురజాడ గ్రామం లో బహుజన సాహిత్య అకాడమీ ఎ.పి.అధ్యక్షులు జంపాన శ్రీనివాస గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజులపాటి మాట్లాడుతూ గురజాడ వెంకటేశ్వరరావు తన జన్మభూమి పై మమకారం తో ఇరవై సంవత్సరాలు ఏకగ్రీవంగా సర్పంచ్ గా పనిచేసి తన గ్రామానికి కావాల్సిన వసతులు ఏర్పాటు చేశారు.పలు భూదానాలు చేసారు.ఆసేవలకు ఆదర్శంగా బహుజన సాహిత్య అకాడమీ (బిఎస్ఎ) ఎ.పి.విభాగం వారు ఇటీవల " ఆచార్య వినోభా భావే" పురస్కారం తో ఆయనను ఘనంగా సత్కరించారని తెలిపారు. బిఎస్ఎ ఎ.పి . విభాగం అధ్యక్షుడు జంపాన శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ గురజాడ వెంకటేశ్వరరావు గ్రామంలో చేసిన ప్రజాహిత కార్యక్రమాలుకు నేను సదరు గ్రామ సర్పంచ్ గా ఉన్నసమయం లో ఉత్తమ పంచాయతీ,ఉత్తమ సర్పంచ్ గా అవార్డు లు అందుకోవడం నా పూర్వజన్మ సుకృతం మని ఆయన స్పూర్తి నేటి యువత కు ఆదర్శమని, సదరు పురస్కార జ్ఞాపకాలు గా ఆల్బమ్ ని బహుకరించామన్నారు.తొలుత సీనియర్ పాత్రికేయులు శివలెంక శంభు ప్రసాద్ స్వాగతోపాన్యాసంతో కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రెడ్డికి కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు రాజులపాటి గురవయ్య, సూర్య నారాయణ, రాధాకృష్ణ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో బాబుతో నేను

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి ప్రభుత్వాన్ని గద్దించటానికి ప్రజల సహకారం అందించాలని, టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఆదివారం అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ శివారు పెద్ద దళిత వాడలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ప్రజలకు వివరిస్తూ, ఇంటింటికి వెళ్లి బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కుమార్ రాజా ప్రజలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్క రాంబాబు, లీగల్ విభాగం మండల శాఖ అధ్యక్షుడు గౌరిపర్తి రవికుమార్, నాయకులు మాయ విజయబాబు పాల్గొన్నారు.

చేపల విక్రయాలకు అనువైన షెడ్లును నిర్మించాలి

విశాలాంధ్ర -నాగాయలంక : రేమాలవారిపాలెం వంతెన సమీపం లో పచ్చి చేపల విక్రయానికి వీలుగా మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక మత్స్యకార నాయకులు తో కలసి మత్స్యకార మహిళలు చేపలు అమ్మకం చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాగాయలంక లోని స్థానిక మత్స్య కార భవనం వద్ద విలేఖరులతో మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్యకార మహిళలు కుటుంబ ఆర్థిక వ్యవస్థలో పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఆర్థిక పరిస్థితి ని పెంపోందించు కునేందుకు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలనే లక్ష్యంతో చేపలు అమ్మకం పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు.కేవలం చేపల వేట అమ్మకాలపై మాత్రమే ఆదార పడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలు చే పల విక్రయాలకు ప్లాటఫారంతో కూడిన షెడ్డు లేకపోవడం వలన ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఎన్నో ఏళ్ళు నుంచి ఇబ్బందులు పడుతున్నారని, వినియోగదారులకు కూడా తిప్పలు తప్పడం లేదని చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని లకనం డిమాండ్ చేశారు. సమావేశంలో మత్స్యకార నాయకులు రేవు సువర్ణ రాజు, నాగిడి తాతారావు, కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మీ రోజున మైనార్టీ ముస్లింలకు విందు

విశాలాంధ్ర-గుడివాడ : గ్యార్మి షరీఫ్(జెండా పండుగ) సందర్భంగా ఆదివారం స్థానిక 12వ వార్డు టిడిపి నాయకులు షేక్ ఇబ్రహీం,మహమ్మద్ నూరుద్దీన్, షేక్ నూరుద్దీన్‌లతో కలసి టిడిపి నాయకులు వెనిగండ్ల రాము ముస్లీలను అలిగంనం చేసుకున్నారు. అనతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొని మైనార్టీ నాయకులకు గార్మీ పండగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైనారిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి : సీఐ నాగప్రసాద్

విశాలాంధ్ర-ఘంటసాల : ఆటో డ్రైవర్లు లైసెన్సు ఇన్సూరెన్స్ తప్పని సరిగా ఉండాలని చల్లపల్లి సిఐ సీ.హెచ్. నాగ ప్రసాద్ అన్నారు. ఘంటసాల పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో స్టేషన్ ఎస్సై కుడి పూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో స్టేషన్ పరిధి లోని ఆటో డ్రైవర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగ ప్రసాద్ మాట్లాడుతూ ఆటో, టాక్సీ డ్రైవర్లు ఖచ్చితంగా తమ లైసెన్సులు, వాహనాల సీ-బుక్కులు తమ వెంట ఉండాలన్నారు. పొల్యూషన్, ఇతర సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. అతివేగం, లౌడ్ స్పీకర్లు వినియోగించిన, మహిళా ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేసిన, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని అనూష

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర స్థాయిలో జరిగే షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని గంజాల అనూష ఎంపిక అయ్యింది. శనివారం విజయవాడలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి షెటిల్ బ్యాడ్మింటన్ పోటీల ఎంపికలలో జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని అనూష ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యిందని పాఠశాల ప్రధానోపాధ్యయులు రవీంద్రబాబు ఆదివారం పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి అనూషను పి.డి ఎం ఉదయ్ కుమార్‌తో కలిసి అభినందించి విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్.ఎం.సి చైర్మన్ శ్రీనివాస్‌లు పాల్గొనగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిన విద్యార్థినికి పలువురు అభినందనలు తెలిపారు.

టాలెంట్ ఎగ్జామ్‌లో విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎ1 మార్ట్ హాల్‌లో శనివారం 8,9 విద్యార్థులకు విడివిడిగా టాలెంట్ ఎగ్జామ్స్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లో చదివే 8,9 తరగతి విద్యార్థులకు మల్టీబుల్ చాయిస్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించి మొదటి బహుమతిగా 5000 రూపాయలు, రెండవ బహుమతిగా 2500 రూపాయలు, మూడవ బహుమతిగా 1250 రూపాయలు, నాల్గోవ బహుమతిగా 500 రూపాయలు నిర్ణయించగా, ఆదివారం ఉదయం విజేతలైన 8 వ తరగతిలో ప్రథమ కె నవీన్ కుమార్, ద్వితియ టి వెంకట అవినాష్, తృతీయ వి సూర్య లతో మరో 8 మందికి కన్సోలేషన్ బహుమతులను, 9 వ తరగతిలో ప్రథమ కె మనోజ్, ద్వితీయ బి ప్రవల్లిక, తృతియ ఇ పల్లవి లతో పాటు మరో 9 మందికి శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మానేపల్లి బాలకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.ఇ.ఓ ఎస్ శివశంకర్ రావు, కోడూరు ఎం.ఇ.ఓ తుంగల రామదాసు, శ్రీనివాసరావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మొవ్వలో కళ్లు తెరిపిద్దాం!

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రాత్రి 7 గంటల నుంచి ఏడు గంటల ఐదు నిమిషాల వరకు మొవ్వ మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామ లింగేశ్వర రావు ఆధ్వర్యంలో "కళ్ళు తెరిపిద్దాం" కార్యక్రమం ఆదివారం రాత్రినిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షురాలు గుత్తికొండ పద్మ, పామర్రు నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు తాతినేని పూర్ణ చంద్ర రావు, మండల శాఖ కార్యదర్శి వీరంగి తులసీదాసు, మండల పార్టీ మాజీఅధ్యక్షుడు మండవ వెంకటేశ్వర రావు,సీనియర్ నాయకులు మండవ కోటేశ్వర రావు,, మండవ వెంకట రావు,, వెంపటి గోపాలకృష్ణ, కాట్రగడ్డ శ్రీనివాస రావు , భోగాదినాగేశ్వరరావు, శీలం బాబూరావు, కొడాలి రామకృష్ణ, గురిందపల్లి గంగయ్య, కొమ్ము కూరి వెంకటేశ్వర రావు, బొల్లా రాంబాబు, మురారి నాగరాజు, మండవ పిచ్చేశ్వర రావు, పాల్గొని నిజం గె లవాలి,కళ్ళు తెరిపిద్దాం అంటూ నినాదాలు చేశారు.

ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అధికారుల, ప్రజాప్రతినిధుల అలసత్వం వల్ల కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములు కొంతమంది కబ్జాదారుల కబ్జాలు చేస్తున్నారని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ కామన్ సైట్‌ను కోటేశ్వరరావు పరిశీలించారు. విజయవాడ 43 వ డివిజన్ ఊర్మిళానగర్‌లో సుమారు నాలుగు ఎకరాలు స్థలం కార్పొరేషన్‌కు ఉందని, ఈ స్థలంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి 2010 శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. పేద,మధ్యతరగతి ప్రజానీకం నివసించే ఈ ప్రాంతంలో హాస్పటల్ నిర్మాణం అవసరం కాబట్టి గతంలో కమిషనర్ నటరాజన్ గుల్జార్ ఉన్నప్పుడు ఈ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు కూడా చేశారన్నారు. కాలక్రమంలో పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధుల వలన కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తరచూ రావటం ఈ స్థలం తమదని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్న సందర్భంలో స్థానికుల అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. గత రెండు రోజుల క్రితం కొంతమంది వచ్చి ఈ స్థలమును చదును చేస్తుండటంతో స్థానికులు అడ్డుకున్నారన్నారు. వెంటనే నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి ప్రభుత్వ స్థలము అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే ఈ స్థలంలో అర్బన్ హెల్త్ సెంటర్ తో పాటు ప్రజా ఉపయోగమైన నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ పరిశీలనలో సీపీఐ నాయకులు, స్థానికులున్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

అవినీతికి అడ్రస్ రెవెన్యూ ..!

-పబ్లిక్‌గా అసైన్‌మెంట్‌కో రేటు..!
-ఇంటి పన్నులేనిదే నో కనెక్షన్?.. ఫ్లోర్‌కు రూ.12వేలు
-లబోదిబోమంటోన్న ఇంటి యజమానులు
-పట్టించుకోని ఉన్నతాధికారులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : విజయవాడ నగరపాలక సంస్థలో ప్రధాన ఆదాయవనరుగా ఉన్న రెవిన్యూ విభాగం, కొందరు అవినీతి పరుల వల్ల ఆ శాఖ అవినీతికి అడ్రస్‌గా మారింది. నగరంలో కొత్త ఇంటిని నిర్మించుకున్న తరువాత విద్యుత్, నీటి కనెక్షన్, డ్రెయినేజీ కనెక్షన్ తీసుకోవాలంటే ముందుగా ఆస్థి పన్ను చెల్లించాలి. ఆ తరువాతే ఆయా కనెక్షన్లు ఇస్తారు. లేదంటే ఏ ఒక్క కనెక్షన్ ఇవ్వరు. నగరపాలకసంస్థ విదివిధానాల్లో ఇదొకటి. లక్షలు పోసి ఇళ్లు కట్టుకున్న తరువాత విద్యుత్, నీటి, డ్రెయినేజీ కనెక్షన్‌లు కూడా అనివార్యం. దీన్ని అనుకూలంగా మలుచుకున్న రెవిన్యూ విభాగంలోని కొందరు లంచావతారులు పబ్లిక్‌గా ఎక్సైన్‌మెంట్‌కో రేటు చొప్పున నిర్ణయించి అందులో ఒకటి కన్నా ఎక్కువ ఫ్లోర్లు ఉంటే ఫ్లోర్‌కొక రేటు ఫిక్స్ చేశారు. వారు అడిగిన కాడికి మామూళ్ళు ఇవ్వకపోతే ఇచ్చే వరకు ఎన్ని రోజులైన ఆస్థి పన్ను కటించుకోకుండా కుంటీ సాకులుతో కాళ్లరిగిపోయేలా తిప్పుతారు. దీంతో లభిదిభో మంటూ చేసేదిలేక ఇంటి యజమానులు ఆ విభాగం అధికారులు అడిగిన కాడికి ముట్టచెప్పక తప్పటందు. ఇటీవల సింగ్‌నగర్‌లోని మూతంతస్తుల భవనాన్ని నిర్మించుకు న్నారు. ఈ ఇంటికి ఆస్థి పన్ను చెల్లించేందుకు వీఎంసీ రెవిన్యూ విభాగం అధికా రుల వద్దకు వెళితే ఫ్లోరుకు రూ.12వేలు చొప్పున మూడు ఫ్లోర్లుకు రూ.36వేలు అడిగారు. ఇదేమని అడిగితే ఇవన్నీ మాకే కాదు, పై అధికారులు, రాజకీయ నాయకులకు వాటాలు ఇవ్వాలని చెప్పటంతో ఆ ఇంటి యజమాని అవాక్కయ్యారు. మామూళ్ళు ఇవ్వనిదే పని జరగదని తెగేసి చెప్పి నెలలు గడిచినా ఇంటి పన్ను కట్టించుకోకపోవటం ఆ విభాగంలో అవినీతి ఏ స్థాయిలో రాజ్యమేలు తోందో అర్థం చేసుకోవచ్చు. మరి దీనికి పాలకులు పరిష్కారం చూపలేరా? అనేది సఘటు మనిషి ఆవేధన. విశాలాంధ్ర వద్ద పక్కా ఆధారాలున్నాయి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇంటి పన్ను లేనిదే ఏ కనెక్షన్ రాదు!

ఇంటి నిర్మాణం పూర్తైన అనంతరం ఆ ఇంటికి విద్యుత్, డ్రెయినేజీ, నీటి కనెక్షన్ ఇవ్వాలంటే తప్పనిసరి ఆస్థి పన్ను చెల్లించాలి. ఆ తరువాతే ఏ కనెక్షన్ అయినా. లక్షలు వెచ్చించి గృహాన్ని నిర్మించుకున్న తరువాత మౌళిక సదుపాయాలు లేకపోతే ఎంత ఖర్చుచేసినా ప్రయోజనం ఉండదు. దీన్ని తమకు అనుకూలంగా మలుచుకున్న నగర పాలక సంస్థ రెవిన్యూ విభాగంలోని కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా మామూళ్ళు దండుకుంటున్నారు. అజిత్‌సింగ్ నగర్‌లోని నందమూరి నగర్‌లో మూగ్గురు కలిసి మూడంతస్తుల భవనినాన్ని నిర్మించుకున్నారు. ఈ భవనానికి ఇంటి పన్ను చెల్లించేందుకు యజమానులు రెవిన్యూ విభాగం అధికారులు వద్దకు వెళితే వచ్చి ఇంటిని పరిశీలించిన కొలతలు వేసి ఆతరువాత బేరం మొదలు పెట్టారు. ఫ్లోర్‌కు రూ.12వేలు చొప్పున మొత్తం రూ.36వేలు మామూళ్ళు చెల్లించాలని తేగేసి చెప్పటంతో ఇంటి యజమానికి నోటి మాటలేదు. దీంతో చేసేదిలేక యజమాని అధికారుల కాళ్ళావేళ్ళా పడి రూ.26వేలకు బేరం కుదుర్చుకుని ఆమేరకు మామూళ్ళు ఇచ్చిన తరువాతే ఆస్థి పన్ను కటించుకున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మా ఒక్కరికే కాదు..అందరికీ..

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవిన్యూ విభాగంలో లంచాలు తీసుకోనిదే ఏ పనీ చేయని కొందరు అధికారులు చెబుతున్న మాటలు చూస్తోంటే అవాక్కవ్వాల్సిందే. ఇవన్నీ మా ఒక్కరికే కాదు. పై అధికారులు, మంత్రుల వరకు వెళతాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ వచ్చే ఎన్నికల్లో ఓడిపోతుందనే భయంతో ఆశాఖ మంత్రి నుంచి పై అధికారుల వరకు నిర్ణయించిన టార్గెట్ ప్రకారం ఖచ్చితంగా నెలనెలా ఇచ్చువ్వాలి. మీరు ఇస్తున్న మామూళ్ళు అన్నీ మాజేబులోకిరావు. ఎవరి వాటా వారికి ఎస్సైన్‌మెంట్స్ ప్రకారం ముట్టచెప్పాలి. అంటూ ఆ విభాగం సిబ్బంది ఆస్థి పన్ను కట్టే ఇంటి యజమాని వద్ద సంబాషిస్తూ చేస్తున్న వత్తిడి వింటుంటే ఎవరికైనా మతి పోవాల్సిందే.

విశాలాంధ్ర చేతికి ఆధారాలు..



నందమూరినగర్‌లో ఓ మూడంతస్తుల భవనానికి ఆస్థి పన్ను వేసేందుకు ఆ శాఖాధికారులు ఆ ఇంటి యజమానుల వద్ద బేరం కుదుర్చుకుని లంచంతీసుకున్న పలు ఆధారాలు విశాలాంధ్రకు చిక్కాయి. మరి నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు వీటి ఆధారంగా చర్యలు తీసుకుంటారా? లేక అవినీతి పరులు చెబుతున్నట్లు వాటాలు తీసుకుని మౌనం వహిస్తారా? పన్నులు కడుతున్న నగర ప్రజలకు పాలకులు సమాదానం చెప్పాల్సి ఉంది.

నగరంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి..

నగరంలో పలు చోట్లు కొత్తగా ఇంటిని నిర్మించుకునే ఇంటి యజమానులు, కొందరు రెవిన్యూ అధికారుల దెబ్బకు బెంబేలెత్తి పోతున్నారు. నగర పాలక సంస్థ పరిదిలోని భవానీపురం రెవిన్యూ విభాగంలో పనిచేసే ఓ అధికారిపై కూడా పలు ఆరోపణలున్నాయి. ఆ అధికారి కృష్ణలంక నెహ్రూనగర్‌లో ఇటీవల మూడు విడతలుగా మూడు ఫ్లోర్లు నిర్మించటంపై చర్చ జరుగుంతోంది. మూడు ఫ్లార్లలో రెండు ఫ్లోర్లకు ప్లాన్ వచ్చే అవకాశం ఉన్నా ప్లాన్ తీసుకోకుండా నిర్మించటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదాయం పన్ను శాఖ దృష్టి పడుతుందనే ఉద్దేశ్యంతో వీఎంసీ టౌన్ ప్లానింగ్ నుంచి ప్లాన్ తీసుకోకుండా ఆ విభాగం అధికారులను మ్యానేజ్ చేసినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అడ్డంగా సంపాదించిన డబ్బుతో ఇటీవలే మూడో ఫ్లోర్ నిర్మించినట్లు స్థానికులు చర్చించుకోవటం విశేషం.

పోలీసుల రక్తదానం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా నగర పోలీస్ కమీషనర్ కాంతి ఆదేశాల మేరకు ఏఆర్ గ్రౌండ్‌లో ఆదివారం కొత్త ప్రభుత్వ ఆసుపత్రి వారి ద్వారా రక్తదానా శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అడ్మిన్ డి.సి.పి.మోకా సత్తిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వతేదీ నుంచి 31వతేదీ వరకు పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. అమరవీరుల స్పూర్తితో రక్తదాన శిబిరానికి తరలి వచ్చి రక్తదానం చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.ఏ.డి.సి.పి. శ్రీనివాసరావు, ఏ.సి.పి.లు, సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): సీపీ కాంతి రాణా ఆదేశాల మేరకు విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. టూటౌన్ స్టేషన్ సీఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు రౌడీషీటర్లు పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారి పై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారి పై కఠిన చర్యలు ఉంటాయని కౌన్సెలింగ్ చేశారు. మంచి నడవడిక కలిగి కుటుంబంతో సంతోషంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శేఖర్, నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు

విశాలాంధ్ర-వీరులపాడు: సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వీరులపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో 10 మరియు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 95 శాతం మార్కులు సాధించిన షేర్-హెూల్డర్స్ పిల్లలకు ఆదివారం ప్రతిభ పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్. కె. వి. సుబ్బయ్య మాట్లాడుతూ 26 ఏళ్లుగా 10 వ మరియు ఇంటర్మీడియట్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన షేర్- హెూల్డర్స్ పిల్లలకు పురస్కారాలు అందించినట్లు చెప్పారు 2022-2023 సంవత్సరంలో ఇద్దరికీ పదివేల నగదు మరియు ప్రశంస పాత్రలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పట్టికొండ చంద్రమోహన్, ఎంపీటీసీ మందూరి ప్రకాశ రావు, బ్రాంచ్ మేనేజర్ పువ్వాడ శివ కృష్ణ చైతన్య మరియు బ్రాంచ్ రిలేషన్షిప్ మేనేజర్ చావ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీ ప్రాథమిక సహకార సంఘ ఉద్యోగుల అసోసియేషన్ 2వ రాష్ట్ర మహాసభ స్థానిక అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 26 జిల్లాల సహకార సంఘాల ఉద్యోగస్తులు పాల్గొని చర్చించారు. జిల్లాల పున:ర్విభజనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ: అధ్యక్షులు సీహెచ్. నరసింహారావు, ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ఎం.మార్కెండేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు పి.రామశేషప్రసాద్, ప్రధాన కార్యదర్శి కకొండల శర్మ, కోశాధికారి ఎస్.హరికృష్ణ, గౌరవ సలహాదారు జి.వీరభద్రరావులు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

ఉన్నత చదువులపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విద్యార్థులు ఉన్నత చదువుల పై దృష్టి పెట్టి పైస్థాయికి ఎదగాలని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ నిర్వహకులు తెలిపారు. ఆదివారం రాజరాజేశ్వరిపేటకు చెందిన పేద విద్యార్థులకు హెల్పింగ్ టు గెదర్ 200 గ్రూప్ ఆధ్వర్యంలో సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటేనే ఆ కుటుంబం ఎదుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచి క్రమ శిక్షణతో బాగా చదవాలని అన్నారు. సైకిళ్ల పై పాఠశాలకు వెళ్లి చక్కటి చదువులు చదువుకొని తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తెవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు షేక్.షఫీవుల్లా, మల్లిక, హిరణ్య, సూరిబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, అందుకు చేపట్టాల్సిన ఉద్యమబాటలో ఉపాధ్యాయ సంఘం నేత లక్ష్మారెడ్డి పాత్ర చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. డెమక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి సంస్మరణ దినోత్సవాన్ని ఆసంఘం ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. లక్ష్మారెడ్డి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో చేపట్టిన ఉద్యమ బాటను వివరించారు. కార్యక్రమంలో సంఘం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధ్యక్షులు గంధం రామారావు, కె.రాజేంద్రప్రసాద్‌లు తొలుత చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పి.కృష్ణయ్య, కె.నరహరి, ఎన్.వి.రమణయ్య, వరుణ్‌కుమార్, బానుమతి, సూరిబాబు, బాలాజీ, తదితరులు ప్రసంగించారు.

రాష్ట్రంలో దళితులను సీఎం చేయటమే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో దళితులకు రానున్న ఎన్నికల్లో రాజ్యాధికారం సాధించటమే తమ పార్టీ లక్ష్యంగా పని చేస్తున్నామని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ ఫౌండర్,అధ్యక్షులు ఎన్. దశరథరామ్ రెడ్డి తెలిపారు. అదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తమ పార్టీ పుట్టినప్పటి నుండి నూటికి 98% దళితులే ఉన్నారు, దళితులకి విముక్తి కలగాలని ఆర్థిక సమానత్వం రాజ్యాధికారం రావాలంటే ఆర్థికంగా బలపడాలని, దేశ సంపదను అందరికీ సమానంగా ఇచ్చే వ్యవస్థ ఉండాలి, దేశ సంపద దోపిడీ వర్గాల చేతుల్లో ఉందని,అంబేద్కర్ అందరికీ ఓటు హక్కు కల్పించారని దానిని సద్వినియోగం చేసుకుంటే దళితులే పీఎం, సీఎంలు, అయి ఉండే వారన్నారు. ఈ సమావేశంలో రెల్లి కుల సంక్షేమ సేవ సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు సిరం శెట్టి నాగేంద్రరావు,జనరల్ సెక్రెటరీ వి.లీలప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

మేరీమాత జన్మదినోత్సవం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో మేరీమాత జన్మదినోత్సవం సందర్భంగా క్రైస్తవ సోదరులు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పుట్రేల రోడ్డులోని లూర్దునగర్ చర్చి నుంచి మేరీ మాత విగ్రహంతో గాంధీబొమ్మ సెంటరు మీదుగా రెడ్డిగూడెం రోడ్డు వరకు ప్రార్థనాగీతాలో ప్రదర్శనగా కొనసాగారు. పలువురు మత బోధకులు, భక్తులు పాల్గొన్నారు.

కూచిపూడి విభాగంలో ప్రపంచ రికార్డ్స్

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలోని త్రినేత్ర ఆర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థులు ఇంటర్నేషనల్ క్లాసికల్ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ కర్ణాటక కు చెందిన వారు ఈ నెల 15న కూచిపూడి నాట్యవిభాగంలో అయిగిరి నందిని అనే అంశాన్ని జగ్గయ్యపేట పట్టణానికి చెందిన త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ వారు పాల్గొనగా అందులో 10 మంది విద్యార్థులు ప్రపంచ రికార్డ్స్ ను సాధించారు.జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఆశ్రిత,భవ్య శ్రీ,కుందన ప్రియ,దక్షిణ్య,పర్ణిక,చరణి తదితరులు ఆన్లైన్ నృత్య తరగతుల్లో ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విద్యార్థులను అభినందించారు, అనంతరం ప్రపంచ రికార్డ్స్ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు భారతీదేవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం గెలవాలి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా న్యాయం గెలవాలి అనే కార్యక్రమం టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంలో న్యాయం గెలవాలి అని గట్టి నినాదాలు చేస్తూ తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత అధినేత కడిగిన ముత్యంలా బయటికి వస్తారని,చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసులు బనాయించారని,రాజకీయంగా ఎదుర్కోలేక ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట సునీత, ఎలమంచిలి రాఘవ, మైనేని రాధాకృష్ణ, గింజుపల్లి రమేష్, ధూళిపాళ్ల లక్ష్మణరావు, గట్టిడి దుర్గాప్రసాద్, సంకా వెంకట్రావు,కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, నకిరకంటి వెంకట్,గొట్టే నాగరాజు, ఇర్రి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, షేక్ సయ్యద్ అన్వర్, గెల్ల వైకుంఠేశ్వరరావు మరియు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హర్షద్వానాలందుకున్న నృత్య, నాటిక ప్రదర్శనలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : దృశ్య వేదిక సాంస్కృతిక సేవా సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన నృత్య, నాటిక ప్రదర్శనలు ప్రేక్షకుల హర్షద్వానా లందుకుంటూ జరిగాయి. మాగులూరి త్రినాథాచారి శిష్య బృందం, నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయ నృత్యాభ్యాసకులు నిఖితశ్రీ, బిందురూప, చైత్ర, శరణ్య, సుస్మిత, సాయి భువన కృతి, దీపిక, భవ్య, వైష్ణవి లు తమిళనాడు మీనాక్షి అమ్మవారి ఎదురుగా నర్తించే భక్తి ఖరగం తో ప్రారంభించి లంబాడి, కోలాటం ఘల్లు ఘల్లు గజ్జల సింగారమా, రేలా రేలా జానపద అంశాలను ప్రదర్శించి అభినందనలందుకున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో నిజం గెలుస్తుంది

విశాలాంధ్ర-విజయవాడ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పటికైనా నిజం గెలుస్తుందని మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య అన్నారు. జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు 42వ డివిజన్ శివాలయం సెంటర్లో రామయ్య అధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకుని ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో నిజం గెలవాలి అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ టీడీపీకి ప్రజలలో వస్తున్న ఆదరణ చూడలేక చంద్రబాబునాయుడుని అక్రమంగా నిర్బంధించారని, ఇంతవరకు ఈ వైసీపీ ప్రభుత్వం రుజువులు నిరూపించలేకపోయారని చెప్పారు. రానున్న రోజుల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఇప్పుడు ఎవరైతే అడ్డగోలుగా మాట్లాడుతున్నారో వాళ్ళందరూ కటకటాల వెనక్కు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి సీతా చంద్రశేఖర్, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు నెలకుర్తి వెంకట రావు, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ మహిళా కార్యదర్శి అందే మేరీ, డివిజన్ ఉపాధ్యక్షులు చింతల వాసు, మైనార్టీ సెల్ డివిజన్ అధ్యక్షులు నజీబ్, డివిజన్ ఐటీడీపీ ఇంచార్జి సందీప్, మైనంపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాంసింగ్‌కు కొల్లు పరామర్శ

విశాలాంధ్ర-విజయవాడ : ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో దాడికి గురై తీవ్ర గాయాలపాలై విజయవాడ విద్యాధరపురంలోని ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న ఆర్టీసీ డ్రైవర్ రాంసింగ్‌ను మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం పరామర్శించారు. టీడీపీ నేతలను ఆస్పత్రిలోకి అనుమతి పోలీసులు నిరాకరించారు. దీంతో టీడీపీ నాయకులు వాగ్వాదం,ఆందోళనకు దిగడంతో ఎట్టకేలకు అనుమతి ఇచ్చారు. డ్రైవర్ రాం సింగ్‌ను పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని కొల్లు రవీంద్ర చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ పై వైసీపీ నేతలు దారుణంగా దాడి చేశారని, ఆర్టీసీ డ్రైవర్‌ను కనీసం మంత్రులు,ఎమ్మెల్యేలు పరామర్శించ లేదని రవీంద్ర విమర్శించారు. తరచూ నా బీసీ లు అంటూ ఊదరగొట్టే సీఎం జగన్.. బీసీ ఉద్యోగికి అండగా ఉండరా అని ప్రశ్నించారు. డ్రైవర్ రాం సింగ్ పై జరిగిన దాడులకు టీడీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గాయాల పాలైన డ్రైవర్ ను కనీసం ఆర్టీసీ ఎండీ, ఉన్నతాధికారులు పరామర్శించలేద అన్నారు. దాడులపై ఆర్టీసీ కార్మికులు ,యావత్ ఉద్యోగులు ఏకమై పోరాడాలన్నారు. . ఉద్యోగులు అందరూ కలసి పోరాడి తమ ఐక్యత చూపించాలన్నారు. రాంసింగ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని వైసీపీకి చెందిన కార్పేరేటర్ ,అనుచరులు ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు వైసీపీ వారిని తప్పించి కేవలం నలుగురైదుగురిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. క్రిమినల్ సీఎం పాలనలో దళిత, బీసీ వర్గాలకు రక్షణ లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్ రాం సింగ్ కుటుంబానికి అండగా నిలబడాలని డిమాండ్ చేశారు.

బోయ వాల్మీకులు-బెంతు ఒరియాలను గిరిజన జాబితాలో చేర్చొద్దు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : గిరిజనులు ఇప్పటికే అనేక రకాలుగా నష్టపోయి ఉన్నారని ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం బోయ వాల్మీకులు బెంతు ఒరియాలను గిరిజన జాబితాలో చేర్చడానికి కమిటీని ఇచ్చిన నివేదికను తక్షణం ఉపసంహరించుకుని బోయ వాల్మీకులను గిరిజన జాబితాల్లో చేర్చటంలేదని స్పష్టం చేయాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన అధ్యక్షతన గిరిజన సమంఘాల నాయకులతో రౌండ్‌టెబిల్ సమావేశం నిర్వహించారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మానుపాటి నవీన్,యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుడుముల రామచంద్రయ్య మాట్లాడుతూ గిరిజన జాబితాలో చేరే అర్హత బోయ వాల్మీకులకు లేదని, సమీప భవిష్యత్తులో కూడా వచ్చే అవకాశాలు ఉండవు అన్నారు. రాయలసీమ ప్రాంతంలో 40 లక్షల జనాభా కలిగిన బోయ వాల్మీకులను అనంతపురం పార్లమెంటు, మరో 6 అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రభావితం చేయగలవని వీరిని మచ్చిక చేసుకునేందుకు అధికార పక్షం, ప్రతిపక్షాలు కమిటీలు వేసి మభ్యపెడుతూ మసి పూసి మారేడు కాయ చేస్తూ వాళ్ళను మోసం చేస్తున్నాయి అన్నారు. ఆ పరిస్థితులు మన రాష్ట్రంలో కుదా సృష్టించాలని చూస్తున్నారన్నారు. ఇటువంటి దుర్మార్గ పూరితమైన చర్యలను రాష్ట్రంలోని మేధావి వర్గం గిరిజన లోకం ఖండించాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో దీనారి ప్రభాకర్,మేడ శ్రీనివాసరావు, బి.గోపి రాజు,ఎస్. మాణిక్యం,ఎ. కోటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో త్రిలోచనాపురం ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : త్రిలోచనాపురం లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారని సొసైటీ సభ్యులు నడుకుదిటి కోటేశ్వరరావు, కన్న దుర్గాదేవిలు తెలిపారు. జూపూడిలో సొసైటీ చెందిన సభ్యుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో కోటేశ్వరరావు, దుర్గాదేవిలు మాట్లాడుతూ, సొసైటీకి సంబంధించి ఆగస్టు నెలలో అనర్హులను సభ్యులుగా చేర్చారు అంటూ ఒక వర్గం ఎన్నికలను బహిష్కరించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికలు ఆగిపోయాయి. అయితే సొసైటీ కి సంబంధించిన అధికారులు మాత్రం సభ్యుల విషయంలో కాదని శాంతిని భద్రత సమస్యతోనే ఎన్నికలు ఆగిపోయాయని చెబుతూనే నవంబర్ 1న సొసైటీకి ఎంక్వైరీ నిమిత్తం వస్తున్నామని సొసైటీ సభ్యులు అందరూ హాజరుకావాలని తెలిపారని అన్నారు. ఎంక్వయిరీకి వస్తున్నారో తెలుపకపోవడంతో సొసైటీ సభ్యులంతా అయోమయంలో ఉన్నారని వాపోయారు. 2013లో అప్పటి సొసైటీ పాలకవర్గం సమక్షంలో జరిగిన అవకతవకలపై సభ్యులుగా ఉన్నవారికి నోటీసులు జారీ చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ మరోసారి స్పందించి తమకు న్యాయం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సమావేశంలో సైకం బాబు, శివ నాగేశ్వరి, సైకం ఆఫ్రీస్ వర్మ, సైకం రామయ్య, చెప్పల నాగేశ్వరరావు, శ్రీను, నాగమ్మ, ఎన్ సాంబశివరావు, ఎస్ శ్రీను, ఎస్ నాగమణి, సిహెచ్ వెంకటేశ్వరమ్మ, పీత కాత్యాయని, జయలక్ష్మి, ఎస్ శివయ్య, పద్మావతి, ఏ చంద్ర దేవి, పి రామకృష్ణ, సిహెచ్ రంగారావు, అంకె విష్ణుమూర్తి, ఏ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులు...జర జాగ్రత్త!

-మలుపుల వద్ద ఆందోళన కలిగిస్తున్న కంకర!
-పొంచి ఉన్న ప్రమాదం -నిద్రావస్థలో అధికార యంత్రాంగం

విశాలాంధ్ర-వీరులపాడు : గత కొన్ని నెలలుగా ఇష్టారాజ్యంగా అధిక లోడుతో దొనబండ నుండి తెలంగాణ రాష్ట్రంలోకి భారీ వాహనాలు భారీ ప్రాజెక్టుల నిమిత్తం కంచికచర్ల, వీరులపాడు మండలాల మీదుగా నిరంతరం తిరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఉండవలసిన పరిమితిని అతిక్రమించి అధిక లోడుతో వాహనాలు తిరుగుతున్నాయి. లారీ బాడీకి మించి రెండు అడుగుల ఎత్తు మేర 40 యమ్.యమ్ సైజు కంకర రాళ్లను తరలిస్తున్నారు. ఈ కంకర రాళ్లు ఎక్కువగా రహదారి మూలమలుపుల వద్ద రహదారిపై పడవేసుకుంటూ లారీలు వెళుతున్నాయి. రహదారిపై చిందరవందరగా కంకర రాళ్లు పడటం వలన వీరులపాడు మండలం జగన్నాథపురం గ్రామం మలుపు వద్ద శుక్రవారం రోజునే పదికి పైగా ద్విచక్ర వాహనాలు జారిపడ్డాయి. రహదారిపై కంకర ఉందని గమనించని కొంతమంది వాహన చోదకులు జారిపడి గాయాల పాలయ్యారు. ఆర్టీవో అధికారుల నిర్లక్ష్యం ధోరణి మరియు గుత్తేదారుల అత్యాశ వెరసి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. కనీస నియమాలు గాలికి వదిలేసారు, లారీ లోడింగ్ పరిమితి ప్రమాణాలు పాటించకపోవడంతో రహదారు నాశనం అయ్యే అవకాశం ఉంది. కంకర రోడ్లపై పడటం వల్ల వాహనాలపై వెళ్లే వారికి,వారి వాహనాలకు ప్రమాదం తీవ్ర స్థాయిలో ఉంటుంది. క్రింద పడ్డ వాహన చోదకుల అవస్థలు అంతా ఇంతా కాదు.... వారి బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక,ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని అయోమయంలో ఉన్నారు. రోడ్లపై విచ్చలవిడిగా కంకర పడటంతో వాహనాలు ఏవిధంగా నడపాలో తెలియక సతమతమవుతున్నారు. అధిక లోడుతో వెళ్లే భారీ వాహనాలను అధికారుల తనిఖీ కొరవడటం ఆర్టీవో అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతుంది. రోడ్ల భద్రతకు చొరవ చూపాల్సిన ఆర్ అండ్ బి అధికారులు సైతం మిన్నకుండటం అనేక అనుమానాలకు తావిస్తుందని ప్రజల భావిస్తున్నారు. ఇకనైనా ఆర్టీవో అధికారులు చొరవ తీసుకొని తనిఖీలు నిర్వహించి కంకర రోడ్లపై పడకుండా ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది...!

చిన్నపత్రికల సమస్యలపై పోరాటాలు చేయాలి

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి సుబ్బారావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : చిన్న పత్రికల సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో ఆదివారం సామ్నా విజయవాడ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్బారావు అక్రిడిటేషన్ ఉన్న చిన్న పత్రికల జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్థలాలు వస్తాయన్నారు. చిన్న పత్రికలకు ఏ సమస్య వచ్చినా రాష్ట్ర యూనియన్ సామ్నాకి అండగా ఉంటుందని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ మాట్లాడుతూ వివిధ పబ్లికేషన్స్ సెంటర్ నుంచి నడుస్తున్న చిన్న పత్రికలకి అక్రిడేషన్లు, ప్రకటనలు ప్రభుత్వం ఇవ్వాలని సూచించారు. చిన్న పత్రికల సమస్యలపై రాష్ట్ర యూనియన్ సమావేశాల్లో కూడా చర్చిస్తామని తెలిపారు. విజయవాడ ఛాంబర్ పత్రిక ఎడిటర్ ఎంసీదాస్ మాట్లాడుతూ చిన్న పత్రికలను ప్రతి ఒక్కరు ఆదరించాలని, సహాయ సహకారాలు అందించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. రమణారెడ్డి మాట్లాడుతూ చిన్న పత్రికల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. చిన్న పత్రికలకు నిబంధనలు సడలించి అక్రిడేషన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సామ్నా విజయవాడ అధ్యక్షులు ఎం.వి.సుబ్బారావు మాట్లాడుతూ సామ్నా ఏర్పాటు చేయడంలో దివంగత అంబటి అంజనేయులు పాత్ర గణనీయమని చెప్పారు. ఈ సమావేశంలో మూడు తీర్మానాలను ఆమోదించారు. చిన్న పత్రికలు అన్నిటికీ అక్రిడేషన్లు ఇవ్వాలని, ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, చిన్నపత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సామ్నా విజయవాడ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎంసీదాస్,అధ్యక్షులుగా ఎంవి సుబ్బారావు, కార్యదర్శిగా ఎస్.గంగరాజు, కోశాధికారిగా ఎం.వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా డి.భాను ప్రసాద్,కార్యవర్గ సభ్యులుగా అడపా ప్రతాప్ చంద్, జె.సుబ్రమణ్యం, శ్రీనివాస్, గోపాలరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు ఎస్.కె.బాబు, విజయవాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, వసంత్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.